

రేపట్నుంచి శ్వేతగిరి యాత్ర

గార : భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని ఈనెల 20న మండలంలోని శాలిహుండంలో వేణుగోపాలస్వామి యాత్ర నిర్వహించనున్నారు. ఈ యాత్రకు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా రాష్ట్రం నుంచి వేలాది మంది యాత్రికులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. సంతాన వేణుగోపాల స్వామిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయానికి శతాబ్దాల చరిత్ర ఉంది. వంశధార నది పక్కన ఎత్తయిన కొండపై వేణుగోపాలస్వామి ఆలయం ఉంది. ఏటా భీష్మ ఏకాదశి పర్వదినాన జాతర నిర్వహిస్తారు. స్వామివారి ఉత్సవ మూర్తులకు వంశధార నదిలో చక్రతీర్థ స్నానాలు చేయిస్తారు. యాత్రకు వేలాది మంది యాత్రికులు తరలిరానుండడంతో శ్రీకాకుళం, నరసన్నపేట, ఆమదాలవలస తదితర ప్రాంతాల నుంచి ఆర్‌టిసి ప్రత్యేక బస్సులను నడపనుంది. యాత్రికులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ మధురెడ్డి తెలిపారు. సిఐ ఎల్.ఎస్ నాయుడు, ఎస్ఐ కృష్ణప్రసాద్ ఆధ్వర్యాన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

జిల్లా వెనుకబాటు... పాలకుల పాపమే

- రాష్ట్ర విభజన తర్వాత ఒక్క పరిశ్రమ రాలేదు
- వ్యవసాయంలోనూ ఆదాయం తగ్గింది
- ప్రజా ప్రణాళికతోనే సమగ్రాభివృద్ధి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లా వెనుకబాటుకు పాలకుల పాపమే శాపమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఎవిఎస్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన శ్రీకాకుళం జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సులో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. రాష్ట్రంలో 32 శాతం పట్టణీకరణ జరిగితే జిల్లాలో 17 శాతమే ఉందన్నారు. ఉపాధి లేక ఇక్కడ్నుంచి వలసలు వెళ్లిపోవడం ఈ ప్రాంత వెనుకబాటుతనాన్ని సూచిస్తోందని చెప్పారు. జిల్లాలో 62 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడుతుండగా, ఆ రంగం ద్వారా 40 శాతం ఆదాయమే వస్తోందన్నారు. రాష్ట్ర విభజన తర్వాత జిల్లాకు ఒక్క పరిశ్రమ రాలేదని చెప్పారు. కొత్తగా పరిశ్రమలు రాకపోగా జిల్లాలో ఉన్న చక్కెర, జ్యూట్ పరిశ్రమలు సైతం మూతపడ్డాయని చెప్పారు. కాలుష్య కారక పరిశ్రమలను ఏర్పాటు చేసి జిల్లాను డంపింగ్ యార్డుగా మార్చేశారని విమర్శించారు. జిల్లా ప్రజల తలసరి ఆదాయం పెంచాలంటే, పరిశ్రమలు పెట్టి ఉపాధి కల్పించాల్సిన అవసరముందన్నారు. జీడి పిక్కలకు కనీస మద్దతు ధర ఇవ్వడం లేదని చెప్పారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా, పంటలకు గిట్టుబాటు ధర చెల్లించకుండా జిల్లా అభివృద్ధి, ప్రజల ఆదాయం పెంచడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. అభివృద్ధికి ప్రత్యామ్నాయ ప్రజా ప్రణాళిక అవసరమని అభిప్రాయపడ్డారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపి, ఆ పార్టీతో అంటకాగుతున్న టిడిపి, వైసిపి అభివృద్ధి చేయలేవన్నారు. వామపక్షాలతోనే ప్రగతి సాధ్యపడుతుందని ఉద్ఘాటించారు.

ప్రజలను సన్నద్ధం చేయాలి

ఎన్నికలు వస్తున్న తరుణంలో జిల్లా సమగ్రాభివృద్ధికి సంబంధించిన ప్రత్యామ్నాయ ప్రజా ప్రణాళికకు అనుగుణంగా ప్రజలను సన్నద్ధం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ అన్నారు. ఓట్ల కోసం వైసిపి, టిడిపి రకరకాల హామీలతో ప్రజల ముందుకు వస్తాయని, ఈ నేపథ్యంలో ఆ ప్రాంత అభివృద్ధికి దోహదపడే అంశాలను అజెండాగా ఉంచేలా ప్రజలను సన్నద్ధం చేయాలన్నారు. జిల్లాలో విస్తారమైన సముద్రతీరం, వనరులను ఎలా ఉపయోగించుకోవాలో, కార్పొరేట్ల దోపిడీ నుంచి ఏ విధంగా కాపాడుకోవాలో తెలుసుకోవాలన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతం మినీ ఇండియా వంటిదని, ఇక్కడ అన్నిరకాల పంటలు, విభిన్నమైన వాతావరణ పరిస్థితులు ఉంటాయని తెలిపారు. జిల్లాలో మైనర్ ఇరిగేషన్‌లో భాగంగా ఉన్న చెరువుల నిర్వహణను ప్రభుత్వం గాలికొదిలేసిందని విమర్శించారు.

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.నాగమణి మాట్లాడుతూ అధికార, ప్రతిపక్ష పార్టీలకు జిల్లా అభివృద్ధి పట్టడం లేదని విమర్శించారు. జిల్లాలో ఉన్న వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకోవడంలో పాలకులు వైఫల్యం చెందారని విమర్శించారు. సభాధ్యక్షులు, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ జిల్లాలోని నీటి వనరులను ఉపయోగించుకుని రెండు పంటలకు నీళ్లు అందిస్తే రైతుల ఆదాయం పెరుగుతుందన్నారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తే వలసలను నివారించవచ్చని సూచించారు. సదస్సులో మేధావులు, విద్యావంతులు, ప్రజా, కార్మిక, రైతుసంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తులసీదాస్



పాల్గొన్న మేధావులు, విద్యావంతులు, ప్రజా, కార్మిక, రైతుసంఘాల నాయకులు

ప్రజల కేంద్రంగా అభివృద్ధి కావాలి



ఉపాధి, విద్య, వైద్యం, కనీస వేతనాలు వంటి ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కావాలి తప్ప కార్పొరేట్ల అభివృద్ధి కాదని పూర్వ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు అధ్యక్షతన నిర్వహించిన 'విద్య-వైద్యం' అంశంపై గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు విజెకె మూర్తి పేపర్ ప్రజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ పాలకులు కార్పొరేట్ల పల్లకీని మోయడం మానేస్తే అభివృద్ధి సాధ్యమేనని చెప్పారు. భూముల రేట్లు, భవంతుల నిర్మాణాలు అభివృద్ధి కాదని, సామాన్య ప్రజల బతుకులు మారితేనే అభివృద్ధి అని స్పష్టం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయకుండా వేరే ప్రత్యామ్నాయం లేదని తేల్చిచెప్పారు. విద్య ప్రయివేటీకరణతో ఒక తరం యువత తీవ్రంగా నష్టపోవడంతో పాటు కొత్త తరంపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

సాగునీటి ప్రాజెక్టుల పెండింగ్‌తో నష్టం



జిల్లాలో చాలా ప్రాజెక్టులు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండిపోవడం వల్లే అనుకున్నంత స్థాయిలో అభివృద్ధి కాలేదని నీటిపారుదల విశ్రాంత చీఫ్ ఇంజినీరు ఉప్పలపాటి నారాయణరాజు అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన 'వ్యవసాయం-సాగునీటి ప్రాజెక్టులు' అంశంపై నీటిపారుదల విశ్రాంత డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.కొండలరావు పేపర్ ప్రజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా నారాయణరాజు మాట్లాడుతూ ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉండడానికి ప్రభుత్వ నిర్లక్ష్యంతో పాటు వ్యవస్థలో ఉన్న లోపాలూ కారణమేనన్నారు. ఒడిశాతో ఉన్న నీటి వివాదాలను ఏళ్లు గడుస్తున్నా పరిష్కరించలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రిబ్యునల్ తీర్పే అంతిమ నిర్ణయంగా రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ప్రజలకు మేలు చేసే విధానాలతో మంచి పాలన అందించే ప్రభుత్వం రావాలని ఆకాంక్షించారు. ప్రజల చైతన్యంతోనే అది సాధ్యపడుతుందన్నారు.

ఆదాయం తగ్గుదలతో అభివృద్ధిపై ప్రభావం



జిల్లాలో వ్యవసాయంపై వస్తున్న ఆదాయం తగ్గడంతో అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతోందని గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ బి.గంగారావు అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.సింహాచలం అధ్యక్షతన నిర్వహించిన 'పారిశ్రామికీకరణ-ఉపాధి అవకాశాలు' అంశంపై సిఐటియు సీనియర్ నాయకులు కె.శ్రీనివాసు పేపర్ ప్రజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ సాంప్రదాయకంగా వ్యవసాయంపై ఆధారపడి ఉన్న రైతుల ఆదాయం తగ్గుతోందని, వారిని ఇతర రంగాలకు మళ్లించి ఆదాయం పెరిగేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో కాలుష్య కారక పరిశ్రమలను ఏర్పాటు చేసి, దాన్నే అభివృద్ధిగా పాలకులు చెప్పుకుంటున్నారని విమర్శించారు. మూలపేట పోర్టులో ప్రభుత్వమే పెట్టుబడులు పెడితే పది వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని, ప్రయివేట్ పెట్టుబడులపై ఆధారపడితే అభివృద్ధి ఉండదని చెప్పారు. కొత్తగా వస్తున్న కంపెనీలు స్థానికులకు ఉపాధి కల్పించకుండా వేరే ప్రాంతం నుంచి కార్మికులను తీసుకోవడంతో, పనుల్లేక వేరే ప్రాంతానికి జిల్లావాసులు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రైవేటు పాఠశాలల్లో పేదలకు ఉచిత విద్య

23 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం


2024-25 విద్యా సంవత్సరానికి జిల్లాలోని అన్ని ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత విద్యకు ఒకటో తరగతిలో ప్రవేశాలకు గానూ పేద విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.జయప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 12(1)సి ప్రకారం ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ (ఐబి, సిబిఎస్ఇ, ఐసిఎస్‌సి, స్టేట్ సిలబస్) పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద పిల్లలకు కేటాయించాలని పేర్కొన్నారు. చదువుపై ఆసక్తి ఉన్నా ప్రతికూల పరిస్థితుల వల్ల సాధ్యం కాని అనాథలు, హెచ్ఐవి బాధితులు, వికలాంగులు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, ఒసి తరగతుల పిల్లలు http://cse.ap.gov.in వెబ్ పోర్టల్‌లో ఈనెల 23 నుంచి మార్చి 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిఎస్‌డబ్ల్యుఎస్‌లోని డేటా ద్వారా మార్చి 22వ తేదీ లోపు విద్యార్థుల అర్హతలను నిర్ధారించనున్నట్లు తెలిపారు. లాటరీ ద్వారా సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. తొలి విడత లాటరీ ఫలితాలు ఏప్రిల్ ఒకటో తేదీన ప్రకటిస్తారని, సీట్లు పొందిన విద్యార్థులు ఏప్రిల్ పదో తేదీ లోగా ఆయా పాఠశాలలకు వెళ్లి సీటు నిర్ధారణ చేసుకోవాలని తెలిపారు. రెండో విడత లాటరీ ఫలితాలను ఏప్రిల్ 15వ తేదీన ప్రకటిస్తారని, అదే నెల 23వ తేదీ లోగా సీటు నిర్ధారణ చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుత చిరునామా ధ్రువీకరణకు విద్యార్థి తల్లిదండ్రుల ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాన్ని దరఖాస్తుతో పాటు సమర్పించాలని తెలిపారు.

రథసప్తమి ఆదాయం రూ.50.90 లక్షలు

గతేడాది కంటే రూ.2.25 లక్షలు అధికం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్య నారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలకు పలురూపాల్లో రూ.50,90,530 ఆదాయం సమకూరింది. ఆలయానికి వచ్చే యాత్రికులకు 2,400 అభిషేకం టిక్కెట్లు విక్రయిడం ద్వారా రూ.12 లక్షల మేర ఆదాయం వచ్చింది. రూ.500కు విక్రయించిన విశిష్ట దర్శనం టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.5.05 లక్షలు, రూ.100కు విియించిన 7,430 టిక్కెట్ల ద్వారా రూ.7.43 లక్షలు, విరాళాల ద్వారా రూ.57,690, కేశఖండన కోసం విక్రయించిన 1219 టిక్కెట్ల ద్వారా రూ.48,760, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.14,12,580, రూ.500 విఐపి టిక్కెట్లు 2,247 విక్రయించగా రూ.11,23,500 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇఒ డి.ఎల్.వి రమేష్‌బాబు తెలిపారు. గతేడాది ఈ ఉత్సవాల్లో రూ.48,65,508 ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.2,25,022 అదనపు ఆదాయం సమకూరింది.



కమిషనర్‌కు చిత్రపటాన్ని అందజేస్తున్న ఇఒ రమేష్‌బాబు తదితరులు



అరసవల్లికి పోటెత్తిన యాత్రికులు

అరసవల్లి ఆలయానికి ఆదివారం యాత్రికులు పోటెత్తారు. మాఘమాసం ఆదివారం కావడంతో రద్దీ పెరిగింది. దీనికితోడు విఐపిలు తరలివచ్చారు. విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యనార్, విజయవాడ టెలికాం సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.శేషాచలం, సౌత్ సెంట్రల్ డిఆర్‌ఎం ఉన్నం అక్కిరెడ్డి సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి వారి జ్ఞాపికలను ఆలయ ఇఒ రమేష్‌బాబు అందజేశారు. ఆదివారం ఒక్కరోజు టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,92,300, విరాళాల రూపంలో రూ.1,57,741, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2,57,075 మొత్తం రూ.7,07,116 ఆదాయం సమకూరినట్లు ఇఒ తెలిపారు.

రుణాల రికవరీ వేగవంతం

డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్

ప్రజాశక్తి- కొత్తూరు

రుణాల రికవరీ వేగవంతం చేయాలని డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్ సూచించారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయాన్ని ఆదివారం సందర్శించారు. ఇందులో భాగంగా వెలుగు ఉద్యోగులతో సమీక్షించారు. ఈ ప్రధానంగా ఎస్‌సి, ఎస్‌టి, టిఎస్‌పి రుణాల రికవరీపై నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోకపోవడంపై పంచాయతీల వారీగా అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా మాట్లాడుతూ ఈ రెండు విభాగాల్లో వంద శాతం రుణ రికవరీ ఉండాలన్నారు. లేకుంటే బాధ్యులపై చట్టపరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. జలజీవన్ మిషన్ పనుల్లో పురోగతికి తక్షణమే కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. దానికి బ్యాంకు ఖాతాలను సోమవారం సాయంత్రానికి ప్రారంభించాలని సూచించారు. లక్ష్యం చేరుకోకపోతే సిబ్బంది చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జగనన్న తోడు రుణాలు వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాలు చేరుకోవడంలో ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రతి మహిళా సంఘాన్ని గ్రేడ్-ఎలో ఉంచేలా చూడాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎపిఎం జనార్ధన, సిసిలు అరుణజ్యోతి, గోవిందరావు, ప్రమీల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్

పెళ్లిసందడి

ఒక్కటి కానున్న వేలాది జంటలు



ప్రజాశక్తి - శ్రీకాకుళం

మాఘమాసం ప్రారంభం కావడంతో పెళ్లి సందడికి తెరలేచింది. బాజా భజంత్రీలు మోగుతున్నాయి. ఒకవైపు వివాహాలు, మరోవైపు గృహ ప్రవేశాలు ఇతర శుభకార్యాలు జరుగుతున్నాయి. ఈనెల 18 నుంచి 29వ తేదీ వరకు మార్చిలో 1, 2, 3, 4, 5, 6, 7, 10, 11, 12 తేదీలు ఏప్రిల్ 17, 19, 20, 21, 22వ తేదీల్లో ముహూర్తాలు ఉన్నాయి. వివాహాలతో పాటు గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు, నిశ్చయ తాంబూలాలు పుచ్చుకునేందుకు ఎవరికి వారు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకున్నారు. వృత్తి, వ్యాపార, విద్య, ఉద్యోగ రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన యువతీ యువకులు మూడు ముళ్ల బంధంతో ఒకటి కాబోతున్నారు. పెళ్లి కాగానే విదేశాలకు వెళ్లాల్సిన కొత్త దంపతులు ముందుగానే ఇందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. మే, జూన్‌లో మూఢం రావడంతో ముహూర్తాలు లేవు. జులైలో 9, 11, 12, 13, 14, 15 తేదీల తర్వాత నవంబరు వరకు పెళ్లి మహూర్తాలు లేవు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏప్రిల్ లోపే వివాహాలు చేసేయాలన్న ఆతృతతో ముహూర్తాలు పెట్టించుకుంటున్నారు. మాఘ మాసం, ఫాల్గుణ మాసం ముహూర్తాల్లోనే అత్యధికంగా జంటలు ఒక్కటి కాబోతున్నాయి. సరాసరి జిల్లావ్యాప్తంగా మాఘమాసంలో ఐదు వేల పైబడి వివాహాలు జరుగుతాయని పురోహితులు తెలిపారు. ఏప్రిల్ వరకు ఎటు చూసినా పందిళ్లు.. సందళ్లు. కళ్యాణ మండపాలు మొదలు వాటిపై ఆధారపడి ఉన్న పలు రంగాలకు డిమాండ్ ఏర్పడింది.

అనుబంధ రంగాలకు ఉపాధి

పెళ్లంటే ఎంతో మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి. పురోహితులు, వంటల తయారీదారులు, షామియానాలు సమకూర్చేవారు, ఫొటోగ్రాఫర్లు, లైటింగ్, పూల అలంకరణ చేసేవారు, మంగళ వాయిద్యాలు, దర్జీలు, ఆభరణ తయారీదారులు, ఐస్ క్రీం, బ్యూటీ పార్లర్లు, కూరగాయల సరఫరాదారులకు ఇప్పటికే గిరాకీ పెరిగింది. పురోహితునికి రూ.పది వేల నుంచి స్థాయిని బట్టి రూ.50 వేల వరకు డిమాండ్ ఉంది. భజంత్రీలకు రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు ఉంది. జిల్లాలోని కళ్యాణ మండపాలు, సత్రాలు, ఆలయాలు, ఫంక్షన్ హాల్స్ ఇప్పటికే బుక్ అయిపోయాయి. ఇవి దొరకని వారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. డిమాండ్ పెరగడంతో కళ్యాణ మండపాల అద్దెలూ పెరిగాయి. ఆయా కళ్యాణ మండపాల స్థాయిని బట్టి రూ.50 వేలు మొదలుకొని రూ.రెండు లక్షల వరకు వసూలు చేస్తున్నారు. కళ్యాణ వేదికల వద్ద డెకరేషన్లకూ మంచి గిరాకీ ఉంది. వివాహాల జోరు పెరగడంతో వాటితో ముడిపడి ఉన్న వారికి చేతినిండా పని దొరుకుతోంది.



అంధత్వ నివారణే లక్ష్యం

- కంటి వెలుగుతో సత్ఫలితాలు
- 283 పాఠశాలల్లో నేత్ర వైద్య శిబిరాలు
- 637 గ్రామాల్లో 2,30,274 మందికి వైద్య పరీక్షలు
- జిల్లా అంధత్వ నివారణ అధికారి త్రినాథరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


జిల్లాలో తీర ప్రాంత గ్రామాలతో పాటు మైదాన ప్రాంతాల్లో అత్యధిక శాతం మందిలో దృష్టిలోపం ఉన్నట్టు గుర్తించి కంటి వెలుగు కార్యక్రమం ద్వారా పెద్ద ఎత్తున నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించామని జిల్లా అంధత్వ నివారణాధికారి డాక్టర్ కె.త్రినాథరావు తెలిపారు. అవసరమున్న వారికి శస్త్రచికిత్సలు, కళ్లద్దాలు పంపిణీ చేశామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వీటితో పాటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సైతం ఈ పథకం ద్వారా పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలను అందజేస్తున్నామని వివరించారు. జిల్లాలో నేత్ర సంబంధిత వ్యాధులపై పూర్తి అవగాహనతో వైద్య బృందాలు తరచూ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని అన్నారు. తద్వారా శస్త్ర చికిత్సకు అవసరమున్న వారిని గుర్తించి సకాలంలో వైద్య సేవలు అందిస్తున్నామని అన్నారు. జిల్లాలో అంధత్వ నివారణకు తీసుకుంటున్న చర్యలపై ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

? నేత్ర సంబంధిత వ్యాధులు రావడానికి కారణాలు ఏమిటి?

జిల్లాలో ప్రధానంగా సముద్ర తీర ప్రాంత గ్రామాల్లో నివాసముంటున్న మత్స్యకారుల్లో ఎక్కువ మందికి నేత్ర సంబంధిత వ్యాధులు ఉన్నాయి. వేటకు వెళ్లే సమయంలో వారికి సముద్రపు కెరటాల నుంచి వచ్చే తేమ ప్రభావం, ఇతర కారణాలతో నేత్ర సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నట్లు గుర్తించాం. మరోవైపు తీరం వెంబడి గాలిలో తేమ సాంద్రతతో పాటు ఉప్పు శాతం అధికంగా ఉండడం వల్ల, మెత్తటి ఇసుక రేణువులు కళ్లో పడినప్పుడు ఈ సమస్య తీవ్రమవుతోంది. దీనికితోడు సకాలంలో వైద్యం తీసుకోకపోవడంతో సమస్య తీవ్రమై చూపు కోల్పోతున్నారు. మత్స్యకారుల్లో 40 ఏళ్ల తర్వాత వచ్చే వ్యాధుల్లో అత్యధిక శాతం మంది చూపు కోల్పోతున్న వారే ఉంటున్నారు. ఈ గ్రామాల్లో తరచూ నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య పరీక్షలు చేపడుతున్నాం.



త్రినాథరావు, జిల్లా అంధత్వ నివారణ అధికారి



? ఆరోగ్య సురక్ష ద్వారా ఎలాంటి సాయం అందుతోంది?

జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా ఇప్పటి వరకు 637 గ్రామాల్లో నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించాం. ఈ పరీక్షల్లో చూపు కోల్పోతున్న వారిలో తీర ప్రాంత ప్రజలే అధికంగా ఉన్నారు. గతంలో రేచీకటి వంటి సమస్యలు ఉండేవి. కానీ, ప్రస్తుతం నూటికి 80 శాతం మందికి దృష్టి లోపం ఉంటోంది. ఆహారపు అలవాట్లు, చక్కెర వ్యాధి అధికంగా ఉన్న వారిలో సి-విటమిన్ లోపించిన వారిలో దృష్టి లోపం అధికంగా ఉంటుంది. దృష్టిలోపం ఉన్న వారిని గుర్తించడానికి సురక్ష పథకం ద్వారా గ్రామాల్లో వైద్య పరీక్షలు చేపడుతున్నాం. ఇప్పటివరకు జిల్లాలో 2,30,274 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించాం. అలాగే 283 పాఠశాలల్లో కంటి వెలుగు ద్వారా 54217 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించాం.

? ఎంతమందికి కళ్లదాలు అందజేశారు?

ఇంతవరకు జిల్లాలో 4214 మంది విద్యార్థులకు కళ్లద్దాలను అందించాం. జిల్లాలో 283 పాఠశాలల్లో నిర్వహించిన పరీక్షల్లో 50,003 మందికి వైద్య పరీక్షల అనంతరం మందులను సరఫరా చేశాం. మందువల్ల నయం కాకపోతే కళ్లద్దాలు అందజేశాం. అలాగే 637 గ్రామాల్లో సుమారు 2.30 లక్షల మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించాం. గ్రామాల్లో 45,773 మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి వారిలో 23,268 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించి అందజేశాం.

? కేటరాక్టు శస్త్రచికిత్సకు ఎంతమందిని గుర్తించారు?

జిల్లాలో క్యాటరాక్టు ఆపరేషన్లకు 2,752 మందికి గుర్తించాం. వారిలో 1038 మందికి శస్త్ర చికిత్సలు ఇప్పటికే పూర్తయ్యాయి. అలాగే 444 రిఫరల్ కేసుల్లో 109 కేసులకు ఇప్పటికే సర్జరీలు పూర్తి చేశాం. వారికి అవసరమైన మందులు సరఫరా ఉచితంగా అందించాం. వీటితో పాటు సాధారణ రోజుల్లో జిల్లా ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో నేత్ర వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నాం. అవసరమున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

ప్రజాశక్తి
www.prajasakti.com

అభివృద్ధి ప్రదాత అప్పలరాజు

పిఎసిఎస్ ఛైర్మన్ మధుకేశవరావు


మధుకేశవరావు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పలాస నియోజకవర్గంలో అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందిస్తూ అభివృద్ధి ప్రదాతగా పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు నిలుస్తున్నారని పిఎసిఎస్ ఛైర్మన్ దువ్వాడ మధుకేశవరావు అన్నారు. మండలంలోని నగరంపల్లిలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మండలంలో సోమవారం మంత్రి అప్పలరాజు చేతుల మీదుగా రూ.5 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభోత్సవాలు చేపడతారని అన్నారు. పల్లిసారధి, దోకులపాడు, చినవంక, నగరంపల్లిలో సచివాలయ భవనాలతో పాటు నగరంపల్లిలో హెల్త్ క్లినిక్, గుల్లలపాడు బిటి రోడ్డును ప్రారంభిస్తారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు కృషి మేరకు నువ్వలరేవు, తాగునీళ్లపేట మధ్య ఉప్పుటేరుపై వంతెన నిర్మాణానికి నిధులు తీసుకొస్తే... అది మీ ఘనతగా సెల్ఫీ తీసుకోవడం సిగ్గుచేటు అన్నారు. ఈయనతో పాటు మామిడి గోపి, ఎస్.నీలాచలం, శిష్టు గౌతమ్ ఉన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

వైసిపిలో 30 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి- రణస్థలం

మండలం కొచ్చెర్లలో జనసేన పార్టీ నుంచి 30 కుటుంబాలు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సమక్షంలో ఆదివారం వైసిపిలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వైస్ సర్పంచ్ పట్నాన శ్రీనువాసరెడ్డి, విద్యాకమిటీ ఛైర్మన్ పట్నాన చిన్నమ్మడు, బస్వ గురుమూర్తి రెడ్డి, బస్వ రమణారెడ్డి, పట్నాన పోలమ్మ, బస్వ లక్ష్మి, బస్వ అప్పయ్యమ్మ, బస్వ రామిరెడ్డి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బస్వ దురుగుబాబు, జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకటరెడ్డి, వైస్ ఎంపిపి ప్రతినిధి మైలపల్లి కామరాజు, వైసిపి నాయకులు చుక్క వెంకట రమణరెడ్డి, పట్నాన అప్పన్నరెడ్డి, బస్వ గురుమూర్తి రెడ్డి పాల్గొన్నారు.


ప్రాజెక్టు ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఇఒ తులసీరావురెడ్డి

సృజనాత్మకతను వెలికితీయాలి

ప్రజాశక్తి- టెక్కలి

విద్యార్థుల్లో నిబిడీకృతమైన సృజనాత్మకతను వెలికి తీయడమే రవీంద్ర భారతి విద్యా సంస్థల ఆశయమని ఆ సంస్థ రీజనల్ ఇన్‌ఛార్జి వెంకటేష్ అన్నారు. స్థానిక రవీంద్రభారతి పాఠశాలలో ఆదివారం సైన్స్ ఎక్స్పో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలకు చెందిన 400 మంది విద్యార్థినీ విద్యార్థులు రూపొందించిన 180 ప్రాజెక్టులకు ప్రదర్శనలో ఉంచారని అన్నారు. ఈ సైన్స్ ఎక్స్పోను మండల విద్యాశాఖ అధికారి దల్లి తులసీరావురెడ్డి పర్యవేక్షించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులు ఆలోచింపజేసి ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంస్థ డీన్ నాగరాజు, ప్రిన్సిపాల్ పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ప్రణీత్‌రాజ్

రాష్ట్రస్థాయిలో మెరిసిన ప్రణీత్‌రాజ్

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ చినబడాం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మల్లా ప్రణీత్‌రాజ్ రాష్ట్రవ్యాప్తంగా ఎడ్యుకేషన్ ఎపిఫణి అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన ప్రతిభ పరీక్షలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. రాష్ట్రవిద్యా శాఖ సహకారంతో పూర్తిగా ఆన్‌లైన్‌లో రెండు దశల్లో నిర్వహించిన పరీక్షలో 9000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో ప్రణీత్‌రాజ్ మొదటి స్థానంలో నిలిచాడు. విజయవాడలో మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి అవార్డు ప్రధానోత్సవంలో పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ చేతులు మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక, రూ.30 వేలు నగదు బహుమతిని అందుకున్నాడు. విద్యార్థి విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉషారాణి , విద్యా కమిటీ ఛైర్మన్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రీన్‌ఆర్మీ సభ్యులు అభినందనలు తెలిపారు.


బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్ కిరణ్‌కుమారి

పంచాయతీ అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి- కవిటి

పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు డి.జి.పుట్టుగ సర్పంచ్ బెందాళం కిరణ్‌కుమారి తెలిపారు. డి.జి.పుట్టుగ - జల్లుపుట్టుగ కూడలిలో ప్రజల సౌకర్యార్థం 15 ఆర్థిక సంఘం నిధులు రూ.లక్షతో వేసిన తాగునీటి బోరును ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీలో పూర్తిస్థాయిలో రహదారుల నిర్మాణంతో పాటు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టినట్టు తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికీ సంక్షేమ పథకాలు అందిస్తూ పూర్తిస్థాయిలో సంక్షేమ పాలన అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి బెందాళం జయప్రకాష్ నారాయణ, ఎంపిటిసి చందాన పూర్ణచంద్రరావు, జల్లు యుగంధర్, జల్లు నరేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

ఇచ్ఛాపురం : విద్యార్థులకు ఇంటర్మీడియట్ చాలా కీలకమని స్వర్ణభారతి విద్యా సంస్థల ఛైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి అన్నారు. స్వర్ణభారతి విద్యా సంస్థ ప్రాంగణంలో జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డేను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన ఆలోచనలతో ముందుకెళ్లాలని అన్నారు. రానున్న పరీక్షల్లో స్వర్ణభారతి విద్యార్థులు ప్రథమస్థానాన్ని కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు సినీ పాటకు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో కళాశాల బాధ్యులు చాట్ల రాము, ప్రిన్సిపాల్ జయ ప్రకాష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తులసీదాస్‌రెడ్డి

ఉద్దానం మునగకు భలే డిమాండ్

రోజుకు రెండున్నర టన్నులు ఎగుమతి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఉద్దానం మునగకు మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా భలే డిమాండ్ ఉంది. ఈ ఏడాది ఉద్దానంలో మునగ పంట విరగ్గసిందని రైతులు చెబుతున్నారు. స్థానిక వ్యాపారులు రోజుకు రెండున్నర టన్నుల వరకు మునగకాయలను రైతులు వ్యాపారుల నుంచి సేకరించి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. తీర ప్రాంతంలో ఎర్రమట్టి ఇసుక దిబ్బలు గల వజ్రపుకొత్తూరు, పలాస, మందస, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం మండలాల్లో మునగ పంటను రైతులు సాగుచేస్తున్నారు. తీర ప్రాంతంలో వాణిజ్య పంటలు లాభాదాయకం కావడంతో సుమారు 60 వేల ఎకరాల్లో జీడి, కొబ్బరి, మామిడి పంటలు సాగు చేస్తున్నారు. ఈ జీడి, కొబ్బరి తోటల్లో మునగ పంటను అంతర పంటగా రైతుకు సాగుచేస్తున్నారు.

మునగ పంట ఏడాదికి మూడుసార్లు కాపుకు వస్తుంది. ముఖ్యంగా సంక్రాంతి ముందు డిసెంబరు నుంచి వచ్చే పంటకు అధిక గిరాకీ ఉంటుంది. ప్రతి ఎకరా తోటలో ఖాళీ ఉన్న ప్రదేశాల్లో సుమారు పది నుంచి 20 వరకు చెట్లు ఉంటాయి. ప్రారంభంలో పలాస మార్కెట్లో మునగ కిలో ధర రూ.100 నుంచి ప్రారంభమై ప్రస్తుతం రూ.40 వద్ద స్థిరంగా ఉంది.

అపారమైన పోషక విలువలు

ఉద్దానంలో సాగుతున్న మునగలో అపారమైన పోషక విలువలు ఉన్నాయి. ఇక్కడ మునక్కాయలు రుచి కారణంగా


అమ్ముతున్న రైతులు

ఉండడంతో వీటికి అప్పారమైన డిమాండ్ ఉంది. వీటి ఆకులను రసంలోను కూరగాను వినియోగిస్తారు. మట్టి సారం బాగుండడంతో పోషక విలువలు ఔషధ గుణాలు ఉంటాయని ప్రతిఒక్కరూ వినియోగిస్తారు.

మునగే జీవనాధారం



గ్రామాల్లో తిరుగుతూ రైతుల వద్ద మునగకాయలు సేకరిస్తూ పలాస మార్కెట్‌కి తీసుకొచ్చి అమ్ముతూ జీవనం కొనసాగిస్తున్నాను. లభ్యత బట్టి రోజుకు 20 నుంచి 30 కిలోల వరకు సేకరించి మార్కెట్‌కు తీసుకొస్తాను. సంవత్సరానికి మూడు సార్లు పండే ఈ మునగ పంటతో ఉపాధి లభిస్తుంది.

- డి.తులసమ్మ, మహిళా వ్యాపారి, ఒంకులూరు


రూ.30 వేలు ఆదాయం



సంక్రాంతి సీజన్‌లో మునగ పంట వల్ల రూ. 30 వేలు ఆదాయం వచ్చింది. దీంతో సంక్రాంతి ఖర్చులకు సరిపోయాయి. తీర ప్రాంత గ్రామాల్లోని చాలామంది రైతులకు మునక్కాయలు ఆర్థికంగా ఆదుకుంటాయి. ధర నిలకడ లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు.

- ఎస్.ధనంజయరావు, రైతు, అక్కిపల్లి

ఒడిశాకే ఎక్కువ ఎగుమతి



ఉద్దానం మునక్కాయలు ఎక్కువగా ఒడిశాలోని బరంపురం, భువనేశ్వర్, భద్రక్, కటక్ ప్రాంతాలకు ఎక్కువగా ఎగుమతి చేస్తున్నాం. అహ్మదాబాద్ నుంచి మునక్కా యలు ఒడిశాకు దిగుమతి పోతున్నడంతో పాటు స్థానికంగా లభించే మునక్కాయలకు చిగురులు కుళ్లిపోవడంతో ధర తగ్గుతూ వస్తుంది. రూ.100 నుంచి రూ.40 కి ధర పడిపోయింది.

- అచ్యుత పాత్రో, మునగకాయల వ్యాపారి, పలాస


సన్మానిస్తున్న జీవిత బీమా సంస్థ ప్రతినిధులు

కృష్ణకుమార్‌కు సన్మానం

ఇచ్ఛాపురం : జీవిత బీమా సంస్థలో 35 ఏళ్ల పాటు డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఎం.వి.కృష్ణకుమార్, దుర్గారాణి దంపతులకు రోటరీ హాల్‌లో ఆదివారం ఘనంగా సన్మానించారు. పలాస బ్రాంచ్ చీఫ్ మేనేజర్ టి.బిసాయి, ఇచ్ఛాపురం బ్రాంచ్ మేనేజర్ ఎమ్మెస్సార్ మూర్తి, సోంపేట బ్రాంచ్ మేనేజర్ ఎం.వెంకటేష్, డెవలప్‌మెంట్ ఆఫీసర్ల యూనియన్ నాయకులు రాజు, ఏజెంట్ల యూనియన్ నాయకులు రాజేంద్రనాయుడు, చిన్నారావు, డాక్టర్ నవ్య పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి శ్రీనివాస్

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మండలం కొత్తపేట గ్రామంలో సన్‌రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీనివాస్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

విప్లవ వనిత జయమ్మ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మండలంలోని పెద్దపాడు, తంగివానిపేట, పాత్రునివలస, సానివాడ, ఒప్పంగి గ్రామాల్లో వీరనారి జయమ్మ స్మారక వారోత్సవాల విజయవంతంపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాండ్ర ప్రకాష్ మాట్లాడుతూ విముక్తి కోసం మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానమే సరైందన్నారు. జయమ్మ 68 ఏళ్ల వయసులో తుదిశ్వాస వరకూ పోరాటమే జీవితంగా నడక సాగించారన్నారు. సమరశీల ప్రజా ప్రతిఘటనా పోరాటాలే జయమ్మకు అర్పించే నిజమైన నివాళి అవుతుందని అన్నారు. ఈ నెల 22న శ్రీకాకుళం ఎన్‌జిఒ హోమ్‌లో ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయిలో జయమ్మ స్మారక సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.కృష్ణవేణి, పివైయల్ జిల్లా కన్వీనర్ సార జగన్, దళితోద్యమ నాయకుడు బాలు పాల్గొన్నారు.

సోంపేట: వీరనారి జయమ్మ నాలుగో వర్ధంతి సందర్భంగా ఆదివారం 24 వరకూ విప్లవ నివాళ్లతో జిల్లా వ్యాప్తంగా వారం రోజుల స్మారక దినాలను పాటించాలని సిపిఐ (యంయల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ నాయకులు గొరకల బాలకృష్ణ పిలుపునిచ్చారు. న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ పిలుపులో భాగంగా జయమ్మ స్మారకంగా మండలంలోని బారువ, కొర్లాం, శాసనాం, లక్కవరం, సోంపేట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పోతనపల్లి కుసుమ, ఎన్.విజయకుమార్, రాపాక మాధవరావు, జె.అప్పయ్య, పోతనపల్లి మల్లేశ్వరరావు, భైరాగి పాపారావు, జ్యోతి పాల్గొన్నారు.


గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

16 కేజీల గంజాయి స్వాధీనం

ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి- పలాస

పలాస రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రాత్రి జిఆర్‌పి పోలీసులు ఫ్లాట్ ఫాంలో ప్రయాణికుల బ్యాగులు తనిఖీ చేస్తుండగా... 16 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడుకు చెందిన మణికంఠ, ఖ్యాతన్‌లు ఒడిశా నుంచి తమిళనాడు రాష్ట్రానికి తరలిస్తున్నారు. ఆర్‌పి ఎస్‌ఐ షరీఫ్ ఆధ్వర్యాన రైల్వే స్టేషన్‌లో ఎన్నికల సమయం కావడంతో ప్రయాణికుల లగేజ్ బ్యాగులను తనిఖీ చేశారు. రెండో నంబరు ఫ్లాట్ ఫాంలో అనుమానాస్పదంగా మణికంఠ, ఖ్యాతన్ కనిపించడంతో లగేజ్ బ్యాగులను తనిఖీ చేయగా... అందులో 16 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరు ఒడిశా ప్రాంతంలో కొనుగోలు చేసి తమిళనాడు రాష్ట్రానికి తరలించేందుకు పలాసలో రైలు ఎక్కేందుకు వచ్చారని అన్నారు. గంజాయి సుమారు రూ.80 వేలు విలువ ఉంటుందని అంచనా వేశామన్నారు. ఇద్దరిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కళ్లద్దాల పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సర్వేంద్రియానం నయనం ప్రధానమని లయన్స్‌క్లబ్ హర్షవల్లి వ్యవస్థాపక అధ్యక్షులు కె.ఎన్.ఎస్.వి ప్రసాద్ (హారికాప్రసాద్) అన్నారు. నగరంలో బాపూజీ కళామందిర్‌లో ఆదివారం 108 మందికి ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అరసవల్లి ఆధ్వర్యాన ఐ ఎక్స్‌ప్రెస్ సౌజన్యంతో వీటిని అందజేశారు. కార్యక్రమానికి క్లబ్ ఉపాధ్యక్షులు వావిలాపల్లి జగన్నాథనాయుడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవయవాల్లో అత్యంత సున్నితమైన భాగం కళ్లని, వాటిని ఎల్లప్పుడు సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కళ్లను నిర్లక్ష్యం చేస్తే చూపు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త రాజేంద్ర కర్నేని మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి వలన కంటిచూపుపై తీవ్ర పరిణామాలు చూపుతున్నాయన్నారు. గతంలో పిల్లలకు తల్లి చందమామని చూపిస్తూ ఆహారం తినిపించేదని,



కళ్లద్దాలు అందజేస్తున్న హారికా ప్రసాద్

ఇప్పుడు సెల్‌ఫోన్ చూపిస్తూ తినిపిస్తోందని చెప్పారు. దీనివల్ల పిల్లల కళ్లలో సున్నితమైన రెటీనా భాగాలు పాడై చూపు పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సందర్భంగా హారికా ప్రసాద్ దంపతులను దుశ్శాలువతో సత్కరించి మెమోంటోను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి అధ్యక్షులు కరణం శోభారాణి, క్లబ్ సభ్యులు డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, డాక్టర్ దినేష్, డాక్టర్ మేడిశెట్టి సత్యస్వరూప్, డాక్టర్ కరణం హారిక, ఇంటెక్ మాజీ కన్వీనర్ రాధా ప్రసాద్, శాహుకారి నాగేశ్వరరావు, ఐ ఎక్స్‌ప్రెస్ ప్రతినిధులు సుమన్, లక్ష్మి కాంత్, జోగినాయుడు, రమణమూర్తి పాల్గొన్నారు.


రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

270 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో ఐకాన్ - జెమ్స్ ఆస్పత్రుల పర్యవేక్షణలో ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 270 మంది రోగులు పాల్గొన్నారు. వీరిలో 50 మందికి అత్యవసర చికిత్స కోసం రాగోలు జెమ్స్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ సందర్భంగా ఐకాన్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ సీపాన హేమమోహన్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని, ప్రతిరోజు ఉదయం అరగంటసేపు వ్యాయామం చేయాలన్నారు. చలికాలంలో గుండె సమస్యలు ఎక్కువగా వచ్చే ఆస్కారం ఉంటుందని, ఈ కాలంలో అందరూ గోరువెచ్చని నీటిని తీసుకోవాలన్నారు. రోగులు మందులను సకాలంలో వినియోగించడం వలన ఉపశమనం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా జెమ్స్ ఆస్పత్రి వైద్యులు బరాటం సాయి వేణు, దీపక్ సింగ్, అనితా దేవి, శ్వేతా భవాని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు పేడాడ పూర్ణారావు, ఉపాధ్యక్షులు సనపల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి దుప్పల శ్రీనివాసరావు, జెమ్స్ ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ పి. రాజేష్, పిఆర్‌ఒ త్రినాధరావు ఐకాన్, జెమ్స్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మాతృభాష వ్యక్తి వికాసానికి దోహదం



మాట్లాడుతున్న విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మాతృభాష వ్యక్తి వికాసానికి దోహదం చేస్తుందని విశ్వ సాహితీ అధ్యక్షులు పివిఎన్ మాస్టారు అన్నారు. ఆదివారం పట్టణంలోని బిఆర్‌నగర్‌లో పొన్నాడ చిన్నవాడు అప్పల నరసమ్మ గ్రంథాలయంలో విశ్వసాహితీ సమావేశాన్ని నిర్వహించారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం (ఫిబ్రవరి 21)పై తొలి పలుకులతో సభను ప్రారంభించారు. ముందుగా విశ్రాంత ఉపాధ్యాయులు బగాది వెంకటరావు మాట్లాడుతూ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ప్రాముఖ్యత, భాషా పరిణామాలు, మాతృభాషగా తెలుగు భాష అభివృద్ధిపై వివరించారు. ఎల్‌ఎన్‌పేట ఎంఇఒ కుప్పిలి చంద్రమౌళి మాట్లాడుతూ మాతృభాష తెలుగు ఆవశ్యత అభివృద్ధి దశలు, భాషా నైపుణ్యాలు వ్యక్తి వికాసానికి దోహదం చేసే క్రమాలపై వివరించారు. విశ్వసాహితీ ముఖ్య కార్యదర్శి కర్నేన జనార్ధనరావు మాట్లాడుతూ తెలుగు అక్షరాలు, సంధులు, వ్యాకరణం, ఛందస్సు వివరించారు. స్వీయ కవితా పఠనంలో భాగంగా ముట్నూరి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు చదివిన మంచం కవిత ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎన్.చంద్రశేఖరం మాస్టారు, తమ్మినేని సూర్యనారాయణ, ఎన్. వాసుదేవరావు, పూజారి సూర్యనారాయణ, వెంకటరమణ తెలుగు బోధనా భాషగా వ్యాప్తి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

విస్తరిస్తున్న కట్టె జనుము సాగు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో కట్టె జనుము సాగు క్రమేపీ విస్తరిస్తుంది. రబీ పంటగా వరి పొలాల్లో రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారు. రబీ పంటగా పెసర, మినుము పంటలను సాగు చేసేవారు. ఈ పంటల్లో కలుపు మొక్కలు ఎక్కువగా ఉండడం, మంచి దిగుబడులు రాకపోవడంతో రైతులు అపరాల పంటపై ఆసక్తి చూపడం లేదు. కట్టే జనుము విత్తనాలకు మార్కెట్లో ధర పలకడంతో ఈ పంట సాగు చేయడానికి రైతులు ముందుకు వస్తున్నారు. కొన్నేళ్ల క్రితం మండలంలో కానరాని ఈ పంట నేడు అన్ని గ్రామాలకు విస్తరించింది. నీటి తడి లేకుండా పండడంతో రైతులు ఈ పంట సాగుకు మొగ్గు చూపిస్తున్నారు. మండలంలో దిబ్బలపేట, కొత్తవలస, చీమలవలస, కొర్లకోట, రామచంద్రాపురం, జొన్నవలస, గాజుల కొల్లివలస తదితర ప్రాంతాల్లో ఈ పంట బాగా సాగవుతుంది. పెట్టుబడి తక్కువగా ఉండడంతో రైతులు ఈ పంట వైపు మొగ్గు చూపుతున్నారు.


జొన్నవలస ప్రాంతంలో పండిస్తున్న కట్టె జనుము పంట

జీవ నియంత్రణ పద్ధతులు అవలంబించాలి


రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్త విశాలాక్షి

ప్రజాశక్తి- రణస్థలం

మారుతున్న వాతావరణ పరిస్థితులు, రోజుకో కొత్తరకం పురుగులు పంటలపై దాడి చేస్తూ రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం జీవ నియంత్రణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విశాలాక్షి ఆందోళన వ్యక్తం చేశారు. మండలం వెంకటరావుపేటలో కొబ్బరి తోటలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులు పంటలపై రసాయనిక మందులు విరివిగా ఉపయోగించడం వలన కొబ్బరిలో రూగోస్ తెల్లదోమ, మొక్కజొన్నలో కత్తెర పురుగు వంటి కొత్తరకం పురుగులు ఆ మందులతో నిరోధక శక్తిని పెంచుకుంటున్నాయన్నారు. దీంతో ఎన్ని మందులు పిచికారీ చేసినా వాటిని నియంత్రించలేక పోతున్నామన్నారు. రైతులు ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా జీవ నియంత్రణ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కొబ్బరిలో రూగోస్ తెల్లదోమ ప్రభావం పలుచోట్ల కనిపిస్తుందని, దీని నివారణకు ఐసీరియా ఫ్యూమోసెరేషియా జీవశిలీంధ్రాన్ని లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలన్నారు. అనంతరం కొబ్బరి తోటల్లో ఐసీరియా పిచికారీపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. తెల్లదోమ నియంత్రణకు దోహదపడే ఎన్ కార్షియా వంటి పరాన్నజీవులను మండలంలో చాలా తోటల్లో ఇప్పటికే విడుదల చేశామని, వాటి ప్రభావం ఆశాజనకంగా ఉందని, అవసరమైన రైతులు తమను సంప్రదించవచ్చని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు, ఎస్.పి.నారాయణ, పి.రమణ, రైతుమిత్ర వి.వీరారెడ్డి, రైతులు పాల్గొన్నారు.


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పైపుల పరిశ్రమలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి- పొందూరు

మండలం రాపాక కూడలి సమీపంలో శ్యామల పైపుల ఇండస్ట్రీస్‌లో ఆదివారం ఉదయం అగ్నిప్రమాదం జరగడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ఫ్యాక్టరీని ఉదయం తెరవగానే స్వల్పంగా మంటలు చెలరేగి పొగ పెద్దఎత్తున రావడంతో వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకుని మంటలను పూర్తిగా అదుపు చేశారు. ఈ ప్రమాదంలో పలు రసాయనాలతో పాటు, ప్యానల్ బోర్డు, పైపులు, విలువైన సామాగ్రి పూర్తిగా కాలిపోయాయి. రసాయనాలు మండడంతో పెద్దఎత్తున పొగ రావడంతో ఊపిరి పీల్చుకోలేకపోవడంతో పాటు మంటలను అదుపుచేసేందుకు సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడ్డారు. విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగానే ప్రమాదం సంభవించిందని, ఈ ప్రమాదంతో రూ.లక్షల్లో నష్టం వాటిల్లినట్లు ఫ్యాక్టరీ యాజమాన్యం తెలిపారు.

ఆరుగురికి రిమాండ్

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలో ఈనెల 9న మాజీ సర్పంచ్ జరుగుల్ల శంకరరావుపై హత్యాయత్నం కేసులో మొత్తం ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసి శ్రీకాకుళం కోర్టులో ఆదివారం హాజరు పర్చగా జడ్జి 14 రోజులు రిమాండ్ విధించినట్టు సిఐ జి.రామచంద్రరావు తెలిపారు. ఈ కేసును జెఆర్‌పురం సిఐ జి.రామచంద్రరావు, ఎస్‌ఐ చిరంజీవి దర్యాప్తు చేశారు. ఎచ్చెర్ల ఎంపిపి మొదలవలస చిరంజీవి నిందితుడిగా గుర్తించి శనివారం అరెస్టు చేయగా, ఆదివారం మరో ఐదుగురిని అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన వారిలో ఎచ్చెర్లకి చెందిన నేతింటి సత్యనారాయణ, బొంతల కోడూరుకు చెందిన పంచిరెడ్డి కైలాస్, శ్రీకాకుళం నగరం గుజరాతీపేటకు చెందిన అలబాన మణి, పెదపాడుకు చెందిన కలగ ఉమామహేశ్వరరావు, కేశవరావు పేట పంచాయతీ కింతలిమిల్లుకు చెందిన సీపాన లక్ష్మీనారాయణను ఆదివారం అరెస్టు చేశారు. వీరికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన అనంతరం న్యాయమూర్తి ముందు హాజరు పర్చారు. శాంతిభద్రతలు పరిరక్షణలో భాగంగా ఫరీదు పేటలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. పూర్తిస్థాయిలో ఆధారాలు సేకరించిన అనంతరం పోలీసులు అరెస్టు చేశారు.

చంద్రపతి మృతి తీరని లోటు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పిట్టా చంద్రపతి ఆకస్మిక మృతి బిసి ఉద్యమానికి తీరని లోటని జిల్లా ఫ్యామిలీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాన కృష్ణచంద్ అన్నారు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి చిత్రపటానికి నివాళ్లర్పించారు. విద్యుత్ శాఖలో సాధారణ ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభించిన ఆయన బిసిల సమగ్ర అభివృద్ధికి నిరంతరాయంగా కృషి చేశారన్నారు. ఆయన కృషి ఫలితంగానే కలెక్టరేట్ సమీపాన జ్యోతిరావుపూలే పార్క్ నిర్మాణం, బిసి స్టడీసర్కిల్ ఏర్పాటు, భవన నిర్మాణం సాధ్యమైందన్నారు.

వైసిపి ఎన్‌ఆర్‌ఐ విభాగ కో-కన్వీనర్‌గా విజయ


విజయ

ప్రజాశక్తి- పొందూరు

వైసిపి ఎన్‌ఆర్‌ఐ విభాగం యుఎఇ కమిటీ కో-కన్వీనర్‌గా రాపాక గ్రామానికి చెందిన సైలాడ విజయను నియమిస్తున్నట్లు ఆదివారం ఆపార్టీ నాయకత్వం ప్రకటించింది. ఎన్‌ఆర్‌ఐ విజయ యుఎఇలో వైసిపి తరుపున పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయడంతో ఆమెను కో-కన్వీనర్‌గా ఎంపికచేసింది. తనను కన్వీనర్‌గా ఎంపిక చేయడం పట్ల సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి, ఆపార్టీ అధినాయకత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. విజయ తండ్రి కొంచాడ రమణమూర్తి పొందూరు పిఎసిఎస్ అధ్యక్షులుగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు వైసిపి నాయకులు అభినందనలు తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం పోలీస్ సర్కిల్ పరిధిలోని ఇచ్ఛాపురం, కవిటి మండలాలు, అర్బన్ స్టేషన్‌లో ఉన్న రౌడీషీటర్లకు సిఐ టి.ఇమాన్యుయల్ రాజు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినట్లయితే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంచి ప్రవర్తనతో మెలగమని సూచించారు. మంచి ప్రవర్తన కలవారికి రౌడీషీటర్‌ను ఎత్తేస్తామని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే రౌడీషీటర్ ఓపెన్ చేస్తామని అన్నారు. వచ్చే ఎన్నికలు ప్రశాంతంగా వాతావరణానికి సహకరించాలన్నారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టౌన్ ఎస్‌ఐ సత్యనారాయణ, రూరల్ ఎస్‌ఐ లక్షణ రావు, కవిటి ఎస్‌ఐ రాము పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ముందుంటా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం పోవాలని, చంద్రబాబు అధికారంలోకి రావాలంటూ మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలో సీపన్నాయుడిపేటలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ పేరుతో సూపర్ సిక్స్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి పాలనలో అందించిన సౌకర్యాలు వివరించారు. రానున్న ఎన్నికల్లో విజయం సాధించి ప్రజలకు స్వపరిపాలన అందించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలు అందిస్తామన్నారు. టిడిపి, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక సమస్యల పరిష్కారంలో ముందుంటామన్నారు. కార్యక్రమంలో నగర టిడిపి అధ్యక్షుడు మాధారపు వెంకటేష్, పార్టీ నాయకులు సీపాన రమేష్ కుమార్, సీపాన దాలినాయుడు, కంచరాన కన్నారావు, కూన త్రినాధ్, పూజారి రామ్మూర్తి, హరినారాయణ, రామారావు పాల్గొన్నారు.


ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్న లక్ష్మీదేవి